# సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 16 । జూలై । 2025




## ముగిసిన తాళ్లపాక బ్రహ్మోత్సవాలు

తాళ్లపాక అన్నమాచార్యులు పూజించిన శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. -8లో



## ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించండి

ప్రభుత్వ భూముల ఆక్రమణలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.250 | రూ.320 |
| రెండోరకం | రూ.180 | రూ.240 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 980 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### హుండీ ఆదాయం రూ.5.23 లక్షలు



**తంబళ్లపల్లె:** మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఈఓ మునిరాజ, కొండ కిట్టల ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించారు. నాలుగు మాసాలుగా భక్తులు హుండీ ద్వారా చెల్లించిన కానుకలు లెక్కించారు. రూ.5,23,275 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### నేడు దర్గా స్వామి జయంతి



దర్గా స్వామీజీ (ఫైల్)

**రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్):** రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బార్ సాయినగర్‌లోని సాయి విద్యామందిర్‌లో ఈ నెల 16న సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గా స్వామీజీ 95వ జయంతి వేడుకలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జయంతి ఉత్సవాలకు భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు తెలియజేశారు.

### 20న జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు

**రాజంపేట టౌన్:** రాజంపేట పట్టణంలోని నూనెవారిపల్లెలో ఉన్న బీవీఎస్ పాఠశాలలో ఈనెల 20వ తేదీ ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో హిందీ వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ 146వ జయంతిని పురస్కరించుకొని 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రేమ్‌చంద్ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 6303701314 నంబర్‌కు ఫోన్ చేసి తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోక పోయినా పోటీ పరీక్ష రోజు నేరుగా కూడా వ్యాసరచన పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు.

### ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు

**కడప ఎడ్యుకేషన్:** కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్–2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సూర్యారావు తెలిపారు. ఓపెన్ ఇంటర్ ద్వారా రెండేళ్ల కోర్సును ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఒక వేళ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేనిచో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### గడువు పొడగింపు



**రాజంపేట టౌన్:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ సి.రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై, ఆసక్తిగల అభ్యర్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం అభ్యర్థులు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఐటీఐలలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే మెరిట్ జాబితాలోకి వస్తారని తెలిపారు. ఈనెల 23, 25వ తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలలో సీట్ల భర్తీకి, 26, 27వ తేదీల్లో ప్రైవేట్ ఐటీఐలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఏ ఐటీఐలో ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ ఐటీఐలోనే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు టెన్త్ మార్కులిస్టు, టిసి, ఆధార్‌కార్డు, రిజర్వేషన్ సౌకర్యం ఉన్న అభ్యర్థులు కులధృవీకరణ పత్రం వంటివి ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకురావాలన్నారు. అలాగే మెయిల్ ఐడి కూడా ఉండాలని తెలిపారు.

# కరుణ చూపని కూటమి

- అంత పెద్ద ప్రమాదం జరిగి కూలీలు చనిపోయినా ప్రకటించని పరిహారం
- రెక్కాడితే కానీ డొక్కాడని యానాదుల కుటుంబాలను ఆదుకోని ప్రభుత్వం
- రెడ్డిపల్లిచెరువు కట్టపై లారీ బోల్తాపడి 9 మంది మృతిచెందగా.. పలువురికి గాయాలు
- కూలీల కష్టంలో పాలు పంచుకోకపోవడంపై విమర్శలు
- గతంలో వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో ఇలాంటి ఘటనలు జరిగితే నేరుగా భారీగా సాయం
- ఘటన జరిగి మూడు రోజులవుతున్నా పట్టించుకోని సర్కార్



సోమవారం సాయంత్రం లారీ ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు (ఫైల్)

**సాక్షి, రాయచోటి:** రెడ్డిపల్లి చెరువుకట్టపై సోమవారం రాత్రి లారీ బోల్తా పడి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందిన 9 మంది చనిపోగా.. చాలా మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రెక్కాడితేగానీ డొక్కాడని కూలీలు మామిడి కాయల కోతకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారిని కూటమి ప్రభుత్వం ఆదుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్దన రెడ్డి వచ్చి పరామర్శతో సరిపుచ్చారే తప్ప ప్రభుత్వం తరపున ఆర్థికసాయం ప్రకటించలేదు. రైల్వేకోడూరు కూటమి నాయకులు రూపానందరెడ్డి అరకొరగా ఖర్చుల నిమిత్తం ఇచ్చారే తప్ప ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఎవరూ ప్రకటించలేదు.

**ప్రాణాలు పోయినా పట్టించుకోరా..?**

ఒకేసారి ప్రమాద ఘటనలో 9 మంది కూలీలు చనిపోగా మరో 10 మందికి పైగా గాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్కార్ ప్రమాదం జరిగిన ఒకరోజో, రెండ్రోజుల్లోపు బాధిత కుటుంబాలను ఆదుకునే దిశగా అడుగులు వేస్తాయి. అయితే ఘటన జరిగినా మూడు రోజులు దాటినా ఇప్పటి వరకు కూటమి సర్కార్ నుంచి పరిహారపు మాటలేదు. అడవిలో దొరికే పదార్థాలతో పాటు కూలి పనులకు వెళితే తప్ప జీవితం గడవని పేద కూలీలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, రేణిగుంటకు చెందిన వారు పనుల కోసం వలస వచ్చి మృత్యువాతపడటం అందరినీ కలిచివేసింది. గాయపడిన వారు కూడా రాజంపేట ఆసుపత్రి నుంచి అలాగే గాయాలకు కట్లుతోనే సోమవారమే వెళ్లిపోయారు. బాధితులు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. ప్రభుత్వం అత్యుత్తమ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోకపోగా పరిహారపు మాట ఎత్తకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేగంగా పరిహారం:**

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎప్పటికప్పుడు పరిహారాన్ని అందిస్తూ వచ్చారు. ఒకటేమిటి రాష్ట్రంలో జరిగిన అనేక ప్రమాదాల విషయంలో.. పరిహారం అందించిన సందర్భాలు కోకొల్లలు. అంతెందుకు జిల్లాలోని అన్నమయ్య డ్యాంతో పాటు పింఛా ప్రాజెక్టులు వరద ఉధృతికి కొట్టుకుపోయి.. ప్రకృతి విపత్తులు ఎదురైన సందర్భంలో కూడా జగన్ సర్కార్ ఆగమేఘాల మీద పరిహారం అందించారు. అన్నమయ్య డ్యాం తెగిపోయి వరద ఉధృతిలో కొట్టుకుపోయి చనిపోయిన ఒక్కొక్కరికి అప్పట్లో వైఎస్‌ఆర్‌సీపీ సర్కార్ రూ.5 లక్షలు చొప్పున.. గాయపడిన వారికి కొంత మొత్తం అందించడంలో వేగవంతంగా చర్యలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే అందుకు భిన్నంగా ఉంది. ఇంత పెద్ద రోడ్డు ప్రమాదం జరిగి అంత మంది చనిపోయినా కూటమి సర్కార్ పరిహారంపై ఇంతవరకు నోరెత్తలేదు.

### ఎదురుచూపులు

శెట్టిగుంట గిరిజన కాలనీ ఇంకా ప్రమాద సంఘటన నుంచి కోలుకోలేదు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఎవరిని కదిపినా కన్నీటి పర్యంతం అవుతున్నారు. చనిపోయిన వారందరూ కాలనీలోని వారికి అంతా బంధువులే కావడంతో వారి బాధ వర్ణనాతీతం. అనుకోని ప్రమాదం నేపథ్యంలో కాలనీలో అంతా చర్చించుకుంటూ మంగళవారం కూడా కన్నీటిపర్యంతం అవుతూ కనిపించారు. ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. చనిపోయిన కుటుంబాలతో పాటు గాయపడ్డ వారికి కూటమి సర్కార్ వెంటనే ఆర్థికసాయం అందించాలని వైఎస్‌ఆర్‌సీపీ డిమాండ్ చేస్తోంది. కూటమి ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### బాధిత కుటుంబాలకు అండగా నిలబడాలి



**రాజంపేట:** రెడ్డిపల్లె చెరువుకట్టపై జరిగిన లారీ బోల్తా ప్రమాద దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నామన్నారు. శెట్టిగుంట గ్రామంలో కూలీనాలీ చేసుకుని జీవించే పేదలు మృతి చెందడం బాధాకరమన్నారు. శెట్టిగుంటకు చెందిన గిరిజన ప్రమాద బాధితుల కుటుంబాలు మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం మానవత్వంతో సాయం చేయాలన్నారు. గతంలో ఇలాంటి ప్రమాదాలలో మృతిచెందిన వారికి ఏ విధంగా ప్రభుత్వాలు ఆర్థికసాయం చేశారో అదే విధంగా ఇప్పటి ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలన్నారు.

### బాధిత కుటుంబాలను ఉపాధి చూపాలి



కడప–రేణిగుంట జాతీయరహదారిలోని పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువుకట్టపై జరిగిన లారీ బోల్తా ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. శెట్టిగుంటకు చెందిన గిరిజనుల కుటుంబాలకు ప్రభుత్వం పెద్దఎత్తున ఆర్థిక సహాయంతో పాటు ఆ కుటుంబాలకు ఉపాధి మార్గాలను చూపించాలన్నారు. ఆ బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. శెట్టిగుంట గిరిజన కుటుంబాలకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నానన్నారు.

## పంచాయతీ పురోగతిపై శిక్షణ



ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

**రాయచోటి జగదాంబసెంటర్:** జిల్లాలోని ఎంపీడీఓలకు, పంచాయతీ కార్యదర్శులకు రాయచోటి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక 2.ఓపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు డీఎల్‌డీఓ లక్ష్మీపతి, డీపీఓ రాధమ్మ, డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. వీరికి పీఆర్ డీఈ దయాకర్‌రెడ్డి, డీపీఓ శివనారాయణ, డీఈఓ సుబ్రమణ్యం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పురోగతి సూచిక 2.ఓ ఫైనాన్షియల్ ఇయర్ 2023–24లో భాగంగా 2025–26 ఫైనాన్షియల్ ఇయర్‌కి గాను, పంచాయతీ పురోగతి ప్రణాళికలను తయారు చేయుటపై శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కడప, చిత్తూరు డీపీఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నేపల్లి పాఠశాల సందర్శన

**అట్లూరు:** అట్లూరు మండలం చెన్నేపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం డీఈఓ షంషుద్దీన్ తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఈఓ వచ్చిన విషయం తెలుసుకున్న చెన్నేపల్లి కాలనీ వాసులు అక్కడకు చేరుకున్నారు. 'అయ్యా మా పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను ఎస్ వెంకటాపురం పాఠశాలకు తరలించాలని ఉపాధ్యాయులు అంటున్నారు. అలా జరిగితే మాపిల్లలను మేం పంపియ్యం.. 5వ తరగతి వరకూ మా కాలనీలోనే చదువు చెప్పాలి' అని విన్నవించారు. స్పందించిన డీఈఓ ఈ సమస్య గురించి విద్యాశాఖ జాయింట్ డైరెక్టరుకు పంపించామని.. అక్కడ నుంచి ఉత్తర్వులు అందే వరకూ ఈ పాఠశాలను ఇక్కడే కొనసాగుతుందని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

## కృత్రిమ మేథపై నైపుణ్యం సాధించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి కె సుబ్రమణ్యం

**రాయచోటి:** నేటి ప్రపంచంలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కృత్రిమ మేథ నైపుణ్యాన్ని గడించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డైట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డైట్ పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వృత్తి విద్య శిక్షణ అందుబాటులో ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిష్ణాతులైన ట్రైనర్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పాఠ్యాంశాలకు అదనంగా చిన్నప్పటి నుండి వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా జీవితంలో త్వరగా స్థిరపడవచ్చన్నారు. నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మై ట్రేడ్, మై డ్రీమ్ పేరుతో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, కేస్ స్టడీస్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో ఏర్పాటు చేసిన కెరీర్ పాత్ చార్ట్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, సమగ్ర శిక్ష సిఎంఓ కరుణాకర్, ఏపీఓ చంద్రశేఖర్, జిల్లా ఒకేషనల్ కో–ఆర్డినేటర్ యోగేష్ కుమార్ రెడ్డి, పాఠశాల ఒకేషనల్ ట్రైనర్లు మహబూబ్ బాష, రామాంజనేయులు, సాయి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## గణితంపై విద్యార్థులలో భయాన్ని పోగొట్టాలి

**రాయచోటి:** గణితంపట్ల విద్యార్థులకు ఉండే భయాన్ని పోగొట్టడానికి గణితం క్లబ్‌లు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం డైట్ అధ్యాపకులు శివ భాస్కర్, కేదార్నాథ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులకు మరింత ఆసక్తికరంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించడానికి నూతన విధానాలను గణిత ఉపాధ్యాయులు అనుసరించాలని డీఈఓ తెలిపారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని సమస్య పరిష్కార నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థులలో పెంపొందించాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు , డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్ పాల్గొన్నారు.

## మిట్స్ కళాశాలకు ప్రమోషన్

- డీమ్డ్ యూనివర్సిటీగా మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల
- అంతటా హర్షాతిరేకం
- అన్నమయ్య జిల్లాకు మకుటాయమానం
- రాయలసీమలోనే ఏకైక కేంద్ర డీమ్డ్ యూనివర్సిటీగా రికార్డు
- ఈ ఏడాది నుండే అడ్మిషన్లు





అంగళ్లులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల

**కురబలకోట:** మదనపల్లె సమీపంలో అంగళ్లు దగ్గరున్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీ (విశ్వ విద్యాలయం)గా ఆవిష్కృతమైంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని యూజీసీ మంగళవారం ప్రకటించింది. ఈఘనత సాధనతో మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు, పాలక వర్గ సభ్యులు, కళాశాల శ్రేణులతో పాటు జిల్లా వాసులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. ఇదొక సరికొత్త నూతన ప్రస్థానమే కాకుండా నూతన అధ్యాయానికి నాంది అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. 1998లో స్థాపితమైన ఈ కళాశాల అంచెలంచెలుగా ఎదిగి రెండు దశాబ్దాలుగా అనేక రికార్డులు సృష్టించింది. పరిశోధన, విజ్ఞాన ప్రదర్శనలు, పారిశ్రామిక సహకారాల్లో విశేషంగా రాణించింది. మరెన్నో గుర్తింపులు పొందింది. ఎన్‌బీఏ, న్యాక్ వంటి సంస్థల నుండి ప్రత్యేక గుర్తింపు పొందింది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం యూజీసీ నుండి డీమ్డ్ హోదా లభించింది. దీంతో ఈ కళాశాల ఉన్న తంబళ్లపల్లె నియోజక వర్గానికే కాకుండా పక్కనున్న మదనపల్లె నియోజక వర్గంకు కూడా ఇది తలమానికంగా మారింది. ఇన్నేళ్లు యూనివర్సిటీ అంటే తిరుపతి, అనంతపురం లేదా పక్కనున్న కర్నాటక, చెన్నై లోని యూనివర్సిటీలకు ఉన్నత చదువులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల యూనివర్సిటీ కావడంతో ఉన్నత చదువులు దగ్గరయ్యాయి. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఆనందోత్సాలతో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ ఏడాది నుండే అడ్మిషన్లకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అనుమతిస్తూ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది.

**సీమకే గర్వకారణం**


ఇది అన్నమయ్య జిల్లా విద్యా క్షేత్రంలో మరో ఘన విజయం. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందడం కళాశాలకే కాకుండా సీమ ప్రాంతంలోనే ఏకైక కేంద్రీయ డీమ్డ్ యూనివర్సిటీ కావడం గర్వకారణం.

– డాక్టర్ విజయ భాస్కర్‌చౌదరి, కరస్పాండెంట్, మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె

# ఉపాధిలో 'తమ్ముళ్ల' దోపిడీ!



మాధవరం సమీపంలో జేసీబీతో ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం



జేసీబీతో పనులు చేస్తూ, గుట్టలు గుట్టలుగా మట్టిని పోస్తున్న దృశ్యం

- జేసీబీ యంత్రాలతో పనులు
- కూలీలకు దూరంగా ఫారమ్ పాండ్స్, ఫిష్ పాండ్స్ పనులు
- అధికారులపై తెలుగు తమ్ముళ్ల ఒత్తిళ్లు



**సాక్షి టాస్క్‌ఫోర్స్:** గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూలీలకు అందకుండా తెలుగు తమ్ముళ్లు దోపిడీకి పూనుకుంటున్న సంఘటనలు రాయచోటి ప్రాంతంలో వెలుగు చూస్తున్నాయి. కరువు కాటకాలకు నిలయమైన ఈ ప్రాంతంలో అరకొరగా జరుగుతున్న ఉపాధి పనులు చేసుకుని పూట గడుపుకుందామనుకుంటున్న కూలీలకు నిరాశే ఎదురవుతోంది. ఫారమ్ పాండ్స్, ఫిష్ పాండ్స్ పనులను అధికారులపై ఒత్తిడి తెచ్చి తెలుగు తమ్ముళ్లు ఆయా పనులను జేసీబీ యంత్రాలతో కానిచ్చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందులో భాగంగానే రాయచోటి మండలం మాధవరం గ్రామంలోని కొండ ప్రాంతాలలో మంజూరైన ఫారమ్‌పాండ్స్, ఫిష్‌పాండ్స్ పనులను ఉపాధి కూలీలతో కాకుండా , జేసీబీ యంత్రాలతో చేస్తున్న విషయాన్ని స్థానిక కూలీలు పసిగట్టి సెల్‌ఫోన్లలో వీడియో చిత్రీకరించారు. ఇటీవల కాలంలో సంబంధిత అధికారులు ఈ విధంగా పనులను కూలీలతో కాకుండా యంత్రాలతో చేయించడం వల్ల సమస్యలు తలెత్తుతాయని వారికి చెప్పినప్పటికి ఎటువంటి మార్పు రాలేదని అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు స్థానికుల్లో చర్చ జరుగుతోంది.

**రాయచోటి మండలానికి 260 ఫారమ్ పాండ్స్ మంజూరు :**

రాయచోటి మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు , తద్వారా రైతుల పొలాలలో నీటి నిల్వ చేయడం వల్ల భవిష్యత్ లో భూగర్భ జలాలు పెంపొందించే ఉద్దేశ్యంతో సుమారు 260 ఫారమ్ పాండ్స్ మంజూరైనట్లు రాయచోటి ఉపాధి ఏపీవో రమేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం 220 వరకు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఫారమ్ పాండ్స్ తోపాటు , ఫిష్ పాండ్స్ , ఇతర ఉపాధి హామీ పథకంలోని పనులన్నీ కూలీలతోనే చేయించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే కొందరు తెలుగు తమ్ముళ్లు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ,కూలీలతో చేయించాల్సిన పనులను కూడా జేసీబీ యంత్రాలతో చేయిస్తుండటం గమనార్హం . ఈ విధంగా జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు చేయించడం వల్ల ఒక్కో ఫారమ్ పాండ్‌కు కొలతల ఆధారంగా రూ.60 నుంచి రూ.70వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ విధంగా సగానికి పైగానే యంత్రాలతో పనులు చే యిస్తూ కోటి నుంచి రెండు కోట్ల రూపాయల వరకు ఉపాధి కూలీల సొమ్మును కొల్లగొడుతున్నట్లు తెలుస్తోంది.

**ఏపీఓ రమేష్ వివరణ:** జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు చేస్తున్న విషయంపై రాయచోటి మండల ఉపాధి ఏపీఓ రమేష్‌ను వివరణ కోరగా.. గతంలో కూలీలు పనులు చేసిన చోటనే యంత్రాలతో పనులు చేస్తున్న విషయం తమ దృష్టికి రాగా వెంటనే ఆపేయాలని, అటువంటివి చేయకూడదని చెప్పామని తెలిపారు. ఉపాధి పనులన్నీ కూడా కూలీలతోనే చేయించే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జేసీబీ , ఇతర యంత్రాలతో పనులను ఎటువంటి పరిస్థితుల్లో ప్రోత్సహించకూడదని ఫీల్డ్‌స్థాయి అధికారులకు కూడా తెలిపామన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

**కడప అర్బన్ :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పలు దొంగతనాలు చేసిన నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ గజ్జల శ్రీనివాస్ (47)ను అరెస్టు చేయడంతోపాటు మరో బాల నేరస్తున్ని అదుపులోకి తీసుకున్నట్లు కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను తెలియజేశారు. గజ్జల శ్రీనివాస్‌పై ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 15 కేసులు ఉన్నాయన్నారు. చలమారెడ్డి పల్లి ఎమ్మెస్సార్ హిల్స్‌లోని ఒక ఇంటిలో, కడప పాత బైపాస్ రోడ్డులోని వెంకట సాయినగర్‌లోని 2 ఇళ్లలో, సాయి నగర్‌లో ఒక ఇంటిలో చోరీ చేశాడన్నారు. కొన్ని రోజులుగా జరిగిన దొంగతనాలకు సంబంధించిన చోరీ సొమ్మును అతని వద్ద నుంచి పూర్తిగా రికవరీ చేసినట్లు తెలిపారు. రికవరీ చేసిన వాటిలో జత బంగారు బుట్టకమ్మ లు, బంగారు ఉంగరం, ఒక కేజీ 500 గ్రాముల వెండి వస్తువులు ఉన్నాయని తెలిపారు.

## 21న ఇంటర్వ్యూలు

**ప్రొద్దుటూరు:** ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 19 లోపు దరఖాస్తులు కళాశాలలో ఇవ్వాలని, ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

# అధికారులకు ప్రొటోకాల్ పట్టదా!

- తంబళ్లపల్లెలో ఉప ముఖ్యమంత్రికి తీవ్ర అవమానం
- శిలాఫలకాల్లో ప్రజాప్రతినిధి కాని వ్యక్తి పేరు కింద పవన్ పేరు
- అభ్యంతరం చెప్పకుండా ప్రారంభించిన మంత్రి జనార్దన్‌రెడ్డి
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అతిథులా..?

**మదనపల్లె :** తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను జిల్లా అధికారులు తీవ్రంగా అవమానించారు. ప్రొటోకాల్ నిబంధనలను పాటించాల్సిన అధికారులు.. వాటిని పక్కన పెట్టి ప్రజాప్రతినిధి కాని వ్యక్తికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఉప ముఖ్యమంత్రికి గౌరవం లేకుండా చేశారు. ఏదైనా అభివృద్ధి కార్యక్రమం జరిగి, వాటికి ప్రారంభోత్సవం చేస్తే జిల్లా అధికారులు ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకాల్లో పేర్లు అచ్చు వేయిస్తారు. అయితే సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో జరిగిన అభివృద్ధి పనుల కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరై ప్రారంభోత్సవాలు చేశారు.

**ప్రొటోకాల్ ఉల్లంఘించి..**

బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో సిమెంటు రోడ్లు, సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం తదితర వాటికి ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ ప్రారంభోత్సవాల కోసం శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. ఇందులో అన్నింటిపైన ప్రారంభకులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్లు పెట్టారు. మూడో పేరుగా డి.జయచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్, తంబళ్లపల్లె నియోజకవర్గం అని పేరు పెట్టారు. ఇతను గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ప్రొటోకాల్ పదవిలో లేరు. కనీసం ఎందులోనూ ప్రజాప్రతినిధి కారు. అయినప్పటికీ జిల్లా అధికారులు ప్రొటోకాల్ నిబంధనను పక్కనపెట్టి మూడో పేరుగా వేయించారు. అందులోనూ జయచంద్రారెడ్డి నిలువెత్తు ఫొటోను అన్ని శిలాఫలకాల్లోనూ వేయించారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో ఈ పేరు వేయకూడదన్న విషయం తెలిసినా.. వేసిన అధికారులు మరో తీవ్రమైన తప్పు చేశారు. ఈ పేరుకింద ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేరు పెట్టారు. అంటే అధికారులకు ఉప ముఖ్యమంత్రి పదవికి ఎంతటి గౌరవం ఇచ్చారో, ఏ మేరకు గుర్తించారో స్పష్టంగా తెలుస్తోంది. కొన్ని శిలాఫలకాల్లో ఇలా చేయగా.. కొన్నింటిలో ఉపముఖ్యమంత్రి పేరుకింద మంత్రి లోకేష్ పేరు పెట్టారు. అసలు ప్రజాప్రతినిధి కాని జయచంద్రారెడ్డి ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి ప్రారంభకులు ఎలా అవుతారో.. ప్రొటోకాల్ నిబంధనలు పాటించాల్సిన జిల్లా అధికారులకు తెలియదా అన్నది చర్చనీయాంశమైంది. ప్రారంభకులు ఎవరైనా దాని కింద ప్రాధాన్యతగా స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పేర్లు పెట్టాలి. దీన్ని కూడా విస్మరించారు. ఈ శిలాఫలకాలను ప్రారంభించిన మంత్రి జనార్దన్‌రెడ్డి దీనిపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకుండానే పర్యటన ముగించుకుని వెళ్లిపోయారు.



శిలాఫలకంలో జయచంద్రారెడ్డి పేరు కింద పవన్‌కల్యాణ్ పేరు



శిలాఫలకాల్లో అతిథులుగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పేర్లు

**ఎమ్మెల్యే, ఎంపీ అతిథులా**

నియోజకవర్గంలో ఏ అభివృద్ధి పని చేపట్టినా, ప్రారంభించినా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీకి మొదటి ప్రాధాన్యత దక్కాలి. వీటికి వీళ్లను కచ్చితంగా అధికారులు ఆహ్వానించి వారి ద్వారానే అమలు చేయాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరించాల్సిన బాధ్యత వారిపై ఉంది. ముఖ్యంగా అధికారిక కార్యక్రమాల విషయంలో జాగ్రత్త అవసరం. అయితే తంబళ్లపల్లె నయోజకవర్గంలో ఇష్టారీతిన ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న అధికారులను జిల్లా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. దీనితో తమకేమికాదులే అన్న నిర్లక్ష్యంతో స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనిఫలితమే సోమవారం బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు. ఈ ప్రారంభోత్సవాలకు మంత్రులు, ఆపై ప్రభుత్వ స్థాయిలో ఉన్న వారితో ప్రారంభోత్సవాలు చేయించొచ్చు. అయితే స్థానిక ఎమ్మెల్యే కూడా ప్రారంభోత్సకుల్లో ఉంటారు. సోమవారం జరిగిన ప్రారంభోత్సవ శిలాఫలకాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అతిథులట. స్థానిక ప్రజాప్రతినిధులు అతిథులు ఎలా అవుతారో కనీసం శిలాఫలం వేసే సమయంలో అధికారులు దీనిపై ఎందుకు పట్టించుకోలేదో వారికే తెలియాలి. వారి ఆధ్వర్యంలో జరగాల్సిన కార్యక్రమాలను వారినే.. అతిథులు చేసిన అధికారులు రెడ్‌బుక్ రాజ్యాంగం మేరకు కొత్త ప్రొటోకాల్ నిబంధనలు అమలు చేస్తున్నట్టుంది. టీడీపీ నాయకుడి నిలువెత్తు ఫొటో వేసిన అధికారులు ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలను ఎక్కడా వేయలేదు. దీన్నిబట్టి చూస్తే అధికారులు ప్రొటోకాల్‌తో తమకేం పని, అంతా మా ఇష్టం అన్నట్టుగా ఉంది వారి వ్యవహారశైలి. ఏడాదిగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు పాటించడం లేదు. దీనికి జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదనా లేక అధికార పార్టీ నేతల మద్దతు ఉందనా? దీనిపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారు, దీనికి ఎవరు బాధ్యులు అవుతారు, ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

**ఎమ్మెల్యే ఆదర్శం**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బి.కొత్తకోట మండలంలోని గుట్టపాళ్యంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. ప్రారంభానికి ముందు శిలాఫలకం చూసి ప్రొటోకాల్ మేరకు ఉండాల్సిన పేర్లు లేవంటూ ఆవిష్కరించలేదు. ప్రొటోకాల్ విషయంలో ఇలా వ్యవహరించాలి.

## క్లుప్తంగా

### ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య



బాలునాయక్ మృతదేహం

**రాజంపేట :** పట్టణంలోని మన్నూరుకు చెందిన జయపాల్ నాయక్(19) సోమవారం ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో అతను అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటపల్లె తండాలో నివాసం ఉండేవాడు. ప్రేమించిన యువతి ఫోన్లో మాట్లాడకపోవడంతో కలత చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సంబంధీకులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ద్విచక్ర వాహనం చోరీ

**పీలేరు :** ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన సోమవారం రాత్రి పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. రొంపిచెర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెంకటేష్ ద్విచక్రవాహనంలో పీలేరు పట్టణం చెన్నారెడ్డివీధికి చెందిన తన స్నేహితుని ఇంటికి వచ్చాడు. తన ద్విచక్రవా హనాన్ని స్నేహితుని ఇంటి ముందు పార్కింగ్ చే శాడు. మంగళవారం ఉదయం ద్విచక్రవాహనం కనిపించక పోవడంతో చోరికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నారెడ్డి వీధికి చెందిన మరో ద్విచక్రవాహనాన్ని దొంగలు కొద్ది దూరం తీసుకెళ్లి స్టార్ట్ కాకపోవడంతో వదిలి వెళ్లారు.

### గంజాయి విక్రేతల అరెస్ట్

**రాజంపేట :** మండలంలోని బోయనపల్లె పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం గంజాయి విక్రయదారులు తోడేటి శేఖర్ (బోయనపల్లె), దార ఈశ్వరయ్య (చీనివారిపల్లె, చింతరాజుపల్లె, ఒంటిమిట్ట)లను అబ్కారీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 2 కేజీల 150 గ్రాముల ఎండు గంజాయిని, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారి జహీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నిందితులను రాజంపేట అబ్కారీ శాఖకు అప్పగించారు.

### వృద్ధురాలి మృతి కేసులో ఇద్దరు అరెస్ట్

**పెద్దమండ్యం :** మనవడి దాడిలో గాయపడిన అవ్వ మృతి చెందిన సంఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న మంగళవారం తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగువపల్లెకు చెందిన ఆర్. లక్ష్మయ్య భార్య నల్లమ్మకు నలుగురు కుమారులు ఉన్నారు. తల్లి పోషణను నలుగురు కుమారులు నెలకు ఒకరు చొప్పున చూసుకునేలా నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మూడవ కుమారుడు ఆర్.చంద్రశేఖర నాయుడు వంతు రాగా అతని ఇంటికి వెళ్లింది. ఈ విషయమై భర్త చంద్రశేఖరనాయుడు, భార్య భాగ్యమ్మలు గొడవ పడ్డారు. భర్తతో గొడవ పడిన విషయాన్ని రాయచోటిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న కుమారుడు ఆర్.నాగేంద్ర నాయుడుకు తల్లి భాగ్యమ్మ ఫోన్ ద్వారా తెలిపింది. ఇంటికి వచ్చిన అతను అవ్వ నల్లమ్మపై ఇటుకరాయితో దాడి చేశాడు. గాయపడిన నల్లమ్మ తిరుపతి రూయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సంఘటనపై మరో మనమడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పీజీ ఖాన్, క్రిషమూర్తి, సిద్దు, శ్రీనివాసులు నాయక్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించండి

**జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్**

**గుర్రంకొండ :** ప్రభుత్వ భూముల ఆక్రమణలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని అరిగెలవారిపల్లెలో ఆయన పర్యటించారు. ఇటీవల గ్రామానికి చెందిన కొంత మంది దారి సమస్య, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్పందన కార్యాక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గ్రామానికి చేరుకొని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. సర్వే నెంబరు 26/2లో మేతబీడు పోరంబోకు భూములు 10.30 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో గుర్తించారు. రికార్డుల ప్రకారం భూములు ఉన్నా.. వాస్తవంగా సదరు భూములు ఆక్రమించుకొని పలువురు ఇళ్ల నిర్మాణాలు, కంచెలు వేసుకున్నట్లు గుర్తించారు. ఆక్రమణదారులు స్థలాలు ఆక్రమించుకోవడమే కాకుండా.. ఆవతలివైపు ఇళ్లకు వెళ్లే దారులను కూడా కబ్జా చేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించ కొన్న వారిని సర్వే చేసి మూడు సెంట్ల స్థలం మాత్రమే ఉంచి మిగిలిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మిగతా భూముల్లో కంచెలు వేసి ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకొని కంచెలను తొలగించాలన్నారు. కబ్జాకు గురైన దారి స్థలాలను సర్వే చేసి మొత్తం మేతబీడు పోరంబోకు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, వీఆర్వో నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అరిగెలవారిపల్లెలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

**రోగులకు మెరుగైన సేవలు అందించాలి**

ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది రిజిష్టరు, మందుల రిజిష్టర్, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, కొన్ని పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని ఆస్పత్రి వైద్యులు చైతన్య కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఖాళీలపై ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, సీహెచ్‌వో సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# అడవి జంతువులను వేటాడిన వ్యక్తి అరెస్ట్

**సిద్దవటం :** సిద్దవటం రేంజి పరిధి అట్లూరు మండలం చలంగారిపల్లి గ్రామ సమీపం లోని పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో అడవి జంతువులను వేటాడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో రేంజర్ కళావతి మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహించారు. అక్కడ అడవి జంతువు అయిన కొండ గొర్రైను ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో వేటాడి చంపి మాంసాన్ని పెద్ద మొత్తంలో విక్రయించడానికి పక్కన పెట్టి, కొంత మాంసాన్ని అడవిలో వండుకొని తింటుండగా వెళ్లి దాడులు చేశారు. గోపవరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బుడమకుంట రమణయ్యను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. వారిలో అట్లూరు మండలం చలంగారిపల్లె గ్రామానికి చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శ్రీను ఉన్నారని రేంజర్ తెలిపారు. వారి కోసం తమ సిబ్బంది గాలింపు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. రమణయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ ఆపరేషన్‌లో ఆరు అడవి జంతువుల కాళ్లు (కొండ గొర్రెలు), వండిన మాంసం, కత్తులు, టార్చిలైట్, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేస్, బీటు అధికారులు, అసిస్టెంటు బీటు అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

# భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

**మదనపల్లె రూరల్ :** కుటుంబ సమస్యలు, వివాహేతర సంబంధం కారణంగా భార్యాభర్తల మధ్య ఏర్పడిన వివాదంలో, భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం రామాపురానికి చెందిన చిన్న వెంకటరమణ కుమారుడు చౌడప్ప (30)కు బి కొత్తకోట మండలం చవటకుంటకు చెందిన కనకలక్ష్మితో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి దేవాన్ష్ కుమారుడు ఉన్నాడు. చౌడప్ప భార్య కుమారుడితో కలిసి బీ కొత్తకోట మండలం గొళ్లపల్లి పంచాయతీ కనికల తోపు వద్ద ఉంటూ, స్థానికంగా వాటర్ క్యాన్ల వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిస అయ్యాడు. అంతేకాకుండా మరో మహిళతో చాటింగ్ చేస్తూ, ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపుతుండడంతో, భార్య కనకలక్ష్మి తరచూ గొడవపడేది. ఇదే విషయమై సోమవారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కనకలక్ష్మి భర్తను తీవ్రంగా మందలించింది. అనంతరం ఆమె రోజువారి కూలీ పనులకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన చౌడప్ప పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న భార్య స్థానికుల సాయంతో బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించింది. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చౌడప్ప మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న ఔట్ పోస్ట్ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీ గదికి తరలించారు. బి కొత్తకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన చౌడప్ప

# వైవీయూలో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు

**కడప ఎడ్యుకేషన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2025- 26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం వైవీయూలోని ప్రిన్సిపల్ చాంబర్‌లో పలువురు డీన్లతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)- 2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా బీఎస్సీ(హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్, ఎర్త్ సైన్స్ కోర్సులలో త్వరలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. బీఎస్సీ(ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతోపాటు కంప్యూటర్ సైన్స్, నానో-సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్, టెక్నాలజీలను విద్యార్థులు ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతోపాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ చదవచ్చన్నారు. బీకాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్ ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్ కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్ వంటి అంశాలలో బలమైన పునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్స్ ఉత్తమ మార్కులతో పూర్తి చేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. విద్యార్థి వైవీయూలో ప్రవేశం పొందడం ద్వారా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను పొందుతారన్నారు. ఆధునిక హాస్టళ్లలో సౌకర్యవంతమైన, సురక్షితమైన అభ్యాస వాతావరణం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో పూర్వ ప్రధానాచార్యులు, ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, డీన్ ఫర్ అకడమిక్ అఫైర్స్ చంద్ర ఓబులరెడ్డి, డీవోయే డైరెక్టర్ టి లక్ష్మి ప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు

# ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి

**జమ్మలమడుగు :** ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల గ్రామంలోని కృష్ణానగర్‌కు చెందిన సువార్తమ్మ(35) డ్వాక్రా సంఘానికి డబ్బులు కట్టాలని, డబ్బులు ఇవ్వాలంటూ కుమారుడిని కోరింది. దీంతో తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో డ్వాక్రా సంఘానికి డబ్బులు కట్టలేక.. ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకునే ప్రయత్నం చేసింది. అయితే చుట్టుపక్కల వారు గుర్తించి వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ మరణించిందని పోలీసులు తెలిపారు.

# దృఢత్వానికి ప్రతీక భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్

**పీలేరు రూరల్ :** నమ్మకానికి, దృఢత్వానికి ప్రతీక భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సి.ఛాయాపతి తెలిపారు. బుధవారం పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలో డీలర్లు, భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాల భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకం తగ్గే అవకాశం ఉండదన్నారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. భారతి సిమెంట్‌కు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ తయారవుతున్న విధానం, భవన నిర్మాణ కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం భారతి సిమెంట్ ప్రతి చోటా అందుబాటులో ఉండేలా డీలర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు సిమెంట్ మోహన్‌రెడ్డి, ఇనాయతుల్లా, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు బీమా పత్రాలు అందజేస్తున్న మేనేజర్ ఛాయాపతి

# ముగిసిన తాళ్లపాక బ్రహ్మోత్సవాలు



పుష్పయాగానికి పూలు తీసుకెళ్తున్న టీటీడీ అధికారులు, సిబ్బంది

**రాజంపేట :** పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు స్వయంగా అర్చించి, పూజించిన శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి వార్ల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టులు సంయుక్తంగా పది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించాయి. కాగా బ్రహ్మోత్సవాల ముగింపు రోజు శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామికి ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, గ్రామస్తులు ఉద్దండం సుబ్రమణ్యం, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీతోపాటు గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున పుష్పయాగంలో పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడి దుర్మరణం



మృతి చెందిన మల్లికార్జున

**మదనపల్లె రూరల్ :** ఆర్టీసీ బస్సు కింద పడి మతిస్థిమితం లేని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. ములకలచెరువు మండలం బురకాయల కోటకు చెందిన గోవిందు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మల్లికార్జున (22).. మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిపోయి, అక్కడక్కడ యాచిస్తూ కాలం గడిపేవాడు. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలోని కదిరి రోడ్డు టిప్పు సుల్తాన్ మైదానం సమీపంలో వచ్చి పోయే వాహనాలను ఆపుతూ యాచిస్తున్నాడు. మధ్యాహ్నం మదనపల్లె ఒకటో డిపోకు చెందిన గాలివీడు -గుర్రంకొండ బస్సు మదనపల్లి నుంచి గుర్రంకొండ కి వెళ్తుండగా, టిప్పు సుల్తాన్ మైదానం వద్ద బస్సును ఆపి ఎక్కేందుకు ప్రయతిస్తూ ప్రమాదవశాత్తు బస్సు కింద పడ్డాడు. బస్సు వెనుక చక్రాలు అతని మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన పాపులమ్మ

**మదనపల్లె రూరల్ :** వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం ముళ్లోలకోటకు చెందిన రెడ్డప్పరెడ్డి (42) భార్య పుష్పలత (35)తో కలిసి ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. స్థానికంగా టైల్స్ దుకాణంలో తమ పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. అమ్మచెరువుమిట్టవద్ద కురబలకోట మండలం కంటేవారిపల్లెకు చెందిన నాగరాజు(45) ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా గుర్రంకొండ దౌలత్‌ఖాన్‌పల్లెకు చెందిన ఆదిమూర్తి (69) భార్య పాపులమ్మ(65)తో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా.. అమ్మచెరువుమిట్ట వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పాపులమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

### ముగిసిన హుసేని పీర్ దర్గా ఉరుసు



దర్గాలోని స్వామి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న స్వామి వారసులు

**బద్వేలు అర్బన్ :** పట్టణంలోని దర్గా వీధిలో వెలసిన హుసేనిపీర్ దర్గా 200వ ఉరుసు మహోత్సవాలు మంగళవారం నిర్వహించిన తహలీల్ ఫాతిహాతో ముగిసాయి. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారసులు స్వామి సమాధికి పూలచాదర్ సమర్పించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారసులతోపాటు శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా ఆవరణలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి నాల్గవ, ఐదవ తరం వారసులు మున్వర్‌బాష, సలీం, దర్గా రహమతుల్లా, దర్గాషఫివుల్లా, దర్గాకరీముల్లా, ఆర్గనైజర్లు షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఏసీఏ పోటీల్లో చిత్తూరు జట్టు విజయం

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లో మూడవ రోజైన మంగళవారం కడప జట్టుపై చిత్తూరు జట్టు 5 పరుగులతో విజయం సాధించింది. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 193 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 85 ఓవర్లకు 239 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని క్యాప్ రెడ్డి 37 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని జయ ప్రకాశ్ 3, దినేష్ 3, తేజేష్ 2 వికెట్లు తీశారు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 239 పరుగులు మాత్రమే చేసింది. చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

### వివాదాస్పద ఫ్లెక్సీ కేసులో ఇద్దరు అరెస్టు

**కడప అర్బన్ :** కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేసులో డాక్టర్‌తో పాటు ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 12వ తేదీ రాత్రి దాదాపు 7 గంటల సమయంలో కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ వద్ద 'ఎంత పని సేచ్చివయ్య జగనూ' అని హెడ్డింగ్ పెట్టి 12 పాయింట్స్ కలిగిన ఒక బ్యానర్‌ను చెన్నై చిల్డ్రన్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ నారపరెడ్డి నాగార్జునరెడ్డి, గ్లేస్ ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమాని అమృతరాజు ఏర్పాటు చేశారన్నారు. ఈ బ్యానర్‌ను పరిశీలించగా అందులో రెండు రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ఉండటంతో.. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు.